సిద్దిపేట
నమస్తే తెలంగాణ
సోమవారం 21 ఏప్రిల్ 2025
MONDAY, APRIL 21, 2025

# హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేత



మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రాజమౌళి, కృష్ణారెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 20: శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు స్థానిక మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఆకుల దేవేందర్ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ మేరకు హరీశ్‌రావును ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈనెల 21 నుంచి 25 వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. అలాగే మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావుకు ఆహ్వాన పత్రికను ఆయన నివాసంలో అందజేశారు.

# 'మల్లన్న' క్షేత్రంలో భక్తుల సందడి



బక్కి వెంకటయ్యకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో అన్నపూర్ణ

- స్వామివారిని దర్శించుకున్న ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య
- భక్తులు విరివిగా విరాళాలు అందించాలి: ఈవో అన్నపూర్ణ



మహామండపంలో పట్నాలు వేస్తున్న భక్తులు

చేర్యాల, ఏప్రిల్ 20: కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 15వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో అన్నపూర్ణ తెలిపారు. అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి మొక్కులు చెల్లించుకొన్నారు. కొండపైన ఉన్న ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో అన్నపూర్ణ తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఎస్ఐ రాజు, ముఖ్య అర్చకులు పడిగన్నగారి ఆంజనేయులు, ఉప ప్రధానార్చకుడు సాంబయ్య, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు.

# రేణుక ఎల్లమ్మ ఆలయానికి విరాళం



రాజేశ్వరరావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 20: మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి గ్రీన్ ఛాలెంజ్ ఇండియా జిల్లా కన్వీనర్, బీఆర్ఎస్ నాయకులు చెప్యాల రాజేశ్వర్‌రావు రూ. 20,116ల విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేసి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ముత్యాల తలంబ్రాలు అందజేత



రామరాజుకు ముత్యాల తలంబ్రాలను అందజేస్తున్న భద్రాచలం ఈవో

గజ్వేల్, ఏప్రిల్ 20: గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో ప్రతి యేడు భద్రాచల సీతారాముల కల్యాణానికి గోటితో వలిచిన తలంబ్రాలను అందజేస్తున్నారు. ఈయేడు 250కిలోల గోటితో వలిచిన తలంబ్రాలను అందజేయడంతో ఆలయ నిర్వాహకులు రామకోటి రామరాజుకు వంద కిలోల ముత్యాల తలంబ్రాలను అందజేశారు. ఆయన అపర రామభక్తిని మెచ్చి ముత్యాల హారాన్ని అందజేశారు. భద్రాచలం ఆలయ ఈవో శ్రవణ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



తొగుట: వెంకట్రావుపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాంరెడ్డి




మద్దూరు: మృతుని కుటుంబీలకు ఆర్థిక సాయం అందిస్తున్న గొడుగు బాలయ్య

తొగుట, ఏప్రిల్ 20: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన దుర్గనోల్ల భూదవ్వ అనారోగ్యంతో మృతిచెందగా, ఆమె మృతదేహానికి నివాళులర్పించారు బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.3 వేల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల తుక్కాపూర్‌లో విద్యుదాఘాతంతో సాయిప్రణీత్ మరణించగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమురయ్య, గ్రామ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు రాములు, బాలరాజు, చిక్కుడు రాజు, లక్ష్మణ్, సయ్యద్ అజాం, మల్లేశం ఉన్నారు.

**గాగిళ్లపూర్‌లో...**

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 20: మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో ఇటీవల పండుగ సిద్దయ్య మృతిచెందాడు. ఆదివారం మృతుని కుటుంబానికి గ్రామానికి చెందిన ముదిరాజ్(ఐదు జింగల) 150 కుటుంబ సభ్యుల సహకారంతో జమ చేసిన రూ. 15వేలను ఆర్థిక సాయంగా గొడుగు బాలయ్య చేతుల మీదుగా అందజేశారు. ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు




డ్రగ్స్ నియంత్రణపై ప్రదర్శన చేస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

వర్గల్, ఏప్రిల్ 20: సకల వసతుల కల్పనలో కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని వర్గల్ ప్రభుత్వ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్‌గౌడ్ అన్నారు. శనివారం రాత్రి పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రగ్స్ నియంత్రణ, చదువు ప్రాముఖ్యత, టెక్నాలజీ వినియోగం, తెలంగాణ సాహిత్య, పండుగల విశిష్టతలను తెలిపే సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐటీఐ భవనానికి మోక్షమెప్పుడో?

## దశాబ్దకాలంగా తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న దుబ్బాక ఐటీఐ

- అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన పక్కా భవనం...
- శిక్షణ తరగతులకు ఆసక్తిచూపని విద్యార్థులు
- త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి: స్థానికులు



దుబ్బాకలో అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన ఐటీఐ పక్కా భవనం

దుబ్బాక, ఏప్రిల్ 20: పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు పారిశ్రామిక వృత్తి విద్యా(ఉపాధి) కోర్సును అందించేందుకు దుబ్బాకలో ప్రభుత్వం ఐటీఐని ఏర్పాటు చేసింది. ఈ కళాశాలలో సుమారు 20 ట్రేడ్‌లు (కోర్సులు) వరకు ఉంటాయి. ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు ఆయా వృత్తి విద్యా కోర్సులలో నైపుణ్యత అందిస్తారు. రెండేండ్ల పాటు ప్రాక్టికల్స్, థియరీ, తదితర సబ్జెక్టుల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. అయితే అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఐటీఐ నిర్వహణ నామమాత్రంగా మారింది. సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, కుకునూరుపల్లి, దుబ్బాకలో మాత్రమే ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి.

### నామమాత్రంగా ఐటీఐ కళాశాల..

దుబ్బాకలో ఐటీఐ ఉన్నట్లు చాలా మందికి తెలియదు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) నామమాత్రంగా కొనసాగుతున్నది. 2014లో అప్పటి ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి ప్రత్యేక చొరవతో దుబ్బాకకు ఐటిఐ మంజూరైంది. దీంట్లో మొదట నాలుగు ట్రేడ్‌లు (కోర్సులు) ఉండేవి. విద్యార్థులు రాకపోవడంతో మూడు ట్రేడ్‌లు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ ఉండగా, ప్రస్తుతం ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లు మాత్రమే కొనసాగిస్తున్నారు. వెల్డర్ ట్రేడ్‌లో విద్యార్థులు రాకపోవడంతో ఆ ట్రేడ్‌ను కొనసాగించడం లేదు. అయితే సరియైన ప్రచారం లేకపోవడంతో చాలామంది విద్యార్థులు ఉపాధి శిక్షణకు నోచుకోలేక పోతున్నారని ఆరోపణలున్నాయి. ఇక్కడ ప్రిన్సిపల్‌తో పాటు మొత్తం 14 మంది సిబ్బంది ఉన్నారు. ఐదుగురు ఇన్‌స్ట్రక్టర్లు, నలుగురు సిబ్బంది, ఇద్దరు వాచ్‌మెన్లు, ముగ్గురు అటెండర్లు ఉన్నారు. పక్కా భవనం లేకపోవడంతో తాత్కాలిక భవనంలో కొనసాగుతుంది. ఈ ఐటిఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ ఈ రెండు ట్రేడ్‌లకు గాను మొత్తం 60 సీట్లు ఉండగా, ఫస్టియర్‌లో 30 , సెకండియర్‌లో 30 సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఫస్టియర్‌లో 26 మంది, సెకండియర్‌లో 22 మంది విద్యార్థులున్నారు. ఇందులో కళాశాలకు వచ్చేది మాత్రం పది మంది కూడా ఉండటం లేదు. విద్యార్థుల సంఖ్య, ఇందులో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య సమానంగా ఉండటం గమనార్హం.

### ఎండ్ల తరబడి అసంపూర్తిగా పక్కా భవనం నిర్మాణం

2014లో ఐటీఐ మంజూరుకాగా, మొదట పాత ఎంపీడీవో కార్యాలయంలో, ప్రస్తుతం ఐకేపీ భవనంలో కళాశాల కొనసాగుతున్నది. ఐకేపీ భవనంలో కింద ఓ మోటర్ బైక్ షోరూం, పైన చిన్నపాటి రెండు గదులలో ప్రభుత్వ ఐటీఐ కొనసాగుతుంది. ఇక్కడ ఐటీఐ ఉన్నట్లు చాలామందికి తెలియదు. కింద బైక్ షోరూం ఉండటంతో ఐటీఐ కనబడకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. దుబ్బాక-హబ్షీపూర్ రోడ్డు పక్కన ఐటీఐకి 2020లో ఐదెకరాల స్థలంలో రూ. 5 కోట్లు నిధులతో ప్రభుత్వం పక్కా భవనం నిర్మాణం చేపట్టింది. జీ ప్లస్ వన్‌లో రూ.3.5 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టి అర్థాంతరంగా వదిలేశారు. అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యంతో భవన నిర్మాణం సకాలంలో పూర్తికాకపోగా, విద్యార్థులకు శాపంగా మారింది. నిర్మాణ పనులు పూర్తిచేసి ఐటీఐ పక్కా భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

> **నిధుల కొరతతోనే భవన నిర్మాణం పూర్తికాలేదు**
>
> దుబ్బాక ఐటీఐ భవనానికి నిధులు విడుదల చేయక పోవడం సమస్యగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వ ఐకేపీ భవనంలో ఐటీఐ తరగతులను కొనసాగిస్తున్నాం. విద్యార్థులకు సరియైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. ప్రాక్టికల్స్, బోధనా తరగతుల నిర్వహణకు సమస్యగా మారింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు చేసి, పక్కా భవన నిర్మాణం పూర్తి చేస్తే విద్యార్థులతో పాటు సిబ్బందికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.
>
> -కనకయ్య, ఐటీఐ ప్రిన్సిపల్, దుబ్బాక




దుబ్బాకలోని ఐకేపీ భవనంపైన కొనసాగుతున్న ప్రభుత్వ ఐటీఐ



ఒకే గదిలో రెండు ట్రేడ్‌ల శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థులు

# మిరుదొడ్డిలో ఉద్రిక్తత



మిరుదొడ్డిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

మిరుదొడ్డి, ఏప్రిల్ 20: మండల కేంద్రమైన మిరుదొడ్డి పట్టణంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించాలని శనివారం రాత్రి పట్టణంలో హిందూవాహిని కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీపై సామాజిక మాధ్యమాల్లో ఇదే పట్టణానికి చెందిన ఓ యువకుడు ఓ వర్గాన్ని రెచ్చగొట్టేలా అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీంతో ఆ యువకుడి ఇంటి ముందు ధర్నా చేయడానికి హిందూవాహిని కార్యకర్తలు వెళ్లే క్రమంలో వారిని మిరుదొడ్డి, దుబ్బాక పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కార్యకర్తలను శాంతింపజేసి దుబ్బాక సీఐ శ్రీనివాస్ మిరుదొడ్డిలో పోలీసులతో పికెటింగ్ ఏర్పాటు చేశారు. అనుచిత వాఖ్యలు చేసిన యువకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మిరుదొడ్డి, దుబ్బాక పోలీసులకు హిందూవాహిని కార్యకర్తలు ఫిర్యాదు చేశారు.

# డిప్యూటి తహసీల్దార్ ఇంటి ఎదుట ఆందోళన



కరీంనగర్‌లో లాస్య ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

అక్కన్నపేట, ఏప్రిల్ 20: భూమి కొనుగోలులో తమను మోసం చేసిన తహసీల్దార్ భర్తపై చర్యలు తీసుకోవాలని మండలంలోని గౌరవెల్లికి చెందిన భైరి చిరంజీవి కోరారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రం అలకాపురి కాలనీలోని జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల డిప్యూటీ తహసీల్దార్ కొయ్యడ లాస్య ఇంటి ఎదుట చిరంజీవి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. తాము గౌరవెల్లి రిజర్వాయర్ కింద భూములు, ఇండ్లు కోల్పోగా వచ్చిన రూ.70 లక్షలను అక్కన్నపేట మండ లం జనగామలో 9.16 ఎకరాల భూమిని కొనుగోలు కింద డిప్యూటీ తహసీల్దార్ లాస్య భర్త రమేశ్‌కు అప్పగించామన్నారు. ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్ కూడా రాసుకున్నామన్నారు. అయితే భూమి కోర్టు వివాదంలో ఉన్నదని చెప్పకుండా తమను మోసం చేశారన్నారు. తిరిగి తమ డబ్బులు తమకు ఇవ్వాలని కోరితే పలు వాయిదాలతో కాలయాపన చేస్తున్నారన్నారు. గతంలో బ్యాంకు చెక్కులు ఇవ్వగా చెక్కు బౌన్సు అయ్యాయన్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశామన్నారు.

# విశ్వావసు నామ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 20: దేవాదాయ ధర్మదాయ శాఖ ఉద్యోగ అర్చక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట మోహినీపూర వెంకటేశ్వర ఆలయంలో విశ్వావసు నామ సంవత్సర క్యాలెండర్‌ను దేవాదాయ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విశ్వనాథ శర్మ, ఆలయ చైర్మన్ అమరేష్ విష్ణు, ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కృష్ణమాచార్యులు, శ్రీధర్‌రెడ్డి, చంద్రకాంత్, రాంరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం



నందారంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి పవన్

అక్కన్నపేట, ఏప్రిల్ 20: పేదల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని ధర్మారం, పోతారం(జే), నందారం గ్రామాల్లో సీపీఐ గ్రామ శాఖల మహాసభలు జరిగాయి. పవన్ మాట్లాడుతూ కార్పొరేట్, బహుళ జాతి కంపెనీలకు, సంపన్న వర్గాలకు అనుకూలంగా కేంద్రం వ్యవహరిస్తూ దేశ సంపదను దోచిపెడుతుందని విమర్శించారు. ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, నాయకులు వనేశ్, జనార్ధన్, రాజు, బాబు, మొగిలి పాల్గొన్నారు.

# నిర్వహణ లోపం.. క్రీడాకారులకు శాపం

- దెబ్బ తింటున్న సిద్దిపేటలోని రన్నింగ్ ట్రాక్, ఫుట్‌బాల్ కోర్టు
- మరమ్మతులు చేపట్టాలంటున్న క్రీడాకారులు, వాకర్స్



సిద్దిపేటలోని రన్నింగ్ ట్రాక్, ఫుట్‌బాల్ కోర్టులో విరిగిపోయిన పిల్లల ఆట వస్తువులు



చిన్నారుల ఊయల దుస్థితి



రన్నింగ్ ట్రాక్ దుస్థితి

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 20: సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల, పాఠశాల ఆవరణలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రన్నింగ్ ట్రాక్, ఫుట్‌బాల్ కోర్టు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. క్రీడాకారుల కోసం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రతిష్టాత్మకంగా దీన్ని నిర్మాణం చేయించారు. ప్రస్తుతం క్రీడా ప్రాంగణాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో అధ్వాన్నంగా మారుతోంది. ఉదయం, సాయంత్రం పట్టణవాసులు వాకింగ్ చేసేందుకు ఇక్కడికి వస్తుంటారు. మరికొంత మంది కుటుంబ సభ్యులతో కలిసి క్రీడాప్రాంగణంలో సేద తీరుతుంటారు. దీని నిర్వహణ సరిగ్గా లేక అంధవిహీనంగా మారుతున్నది. ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పడి ఉంటుంది. ప్రహరీ చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేసినప్పటికీ నీరు పట్టక ఎండిపోతున్నది. రాత్రి సమయంలో గేట్లు తెరిచి ఉంచడంతో కొందరు ఆకతాయిలు ద్విచక్ర వాహనాలను సైతం రన్నింగ్ ట్రాక్‌పై తిప్పుతుండడంతో అక్కడక్కడ దెబ్బతిన్నది. ప్రైమరీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వివిధ రకాల ఆట వస్తువులు ఎక్కడికక్కడ విరిగిపోయి కనబడుతున్నాయి. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఊయలలు తెగిపోగా పక్కన కట్టేశారు. రన్నింగ్ ట్రాక్ మధ్యలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ గ్రీనరీ కూడా చిరిగిపోతున్నది. ఇదివరకు రాత్రి సమయంలో ఇక్కడ వాచ్‌మెన్ ఉండగా.. ప్రస్తుతం ఎవరూ లేకపోవడంతో రాత్రి సమయంలోనూ ప్రధాన గేట్లు తెరిచే ఉంటున్నాయి. అధికారులు మరమ్మతులు చేపట్టాలని పట్టణవాసులు, క్రీడాకారులు కోరుతున్నారు.

> **మరమ్మతులు చేయాలి**
>
> 
>
> ప్రతినిత్యం వాకింగ్ చేయడానికి ఇక్కడికి వస్తాం.. రన్నింగ్ ట్రాక్‌తో పాటు పిల్లలు ఆడుకునే ఆటవస్తువులకు మరమ్మతులు చేయాలి. వాకింగ్‌కు వచ్చేవారికి సౌకర్యాలు కల్పించాలి. ఎండిపోయిన మొక్కల ప్రాంతంలో కొత్త మొక్కలు నాటి గ్రీనరీని కాపాడాలి. పట్టణ ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా సౌకర్యాలు కల్పించాలి.
>
> – అయిత చంద్రయ్య, రచయిత, మార్నింగ్ వాకర్, సిద్దిపేట

## నేడు భూభారతిపై అవగాహన కార్యక్రమం

మిరుదొడ్డి, ఏప్రిల్ 20: ఈనెల 21న సోమవారం ఉదయం మిరుదొడ్డి పట్టణంలోని రైతు వేదికలో భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మిరుదొడ్డి తహసీల్దార్ ఉదయశ్రీ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రైతులు హాజరుకావాలని కోరారు.

## సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని వినతి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 20: హుస్నాబాద్ పట్టణంలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు హుస్నాబాద్ మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ ఆదివారం వినతి పత్రం సమర్పించారు. ఆలాగే జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగిన సమయంలో వారికి తక్షణ వైద్య సహాయం అందించే జాతీయ ట్రామా కేర్ సెంటర్‌ను సైతం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు.

## శిఖర ప్రతిష్ఠాపనోత్సవం



శిఖర ప్రతిష్ఠాపన చేస్తున్న ఆలయ వేద పండితులు

గజ్వేల్, ఏప్రిల్ 20: పట్టణంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శిఖర ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఆలయ వేద పండితులు, నిర్వాహకులు నిర్వహించారు. సోమవారం నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లను నిర్వాహకులు చేపట్టారు.

## ఘనంగా పోచమ్మ దేవాలయం వార్షికోత్సవం

మిరుదొడ్డి, ఏప్రిల్ 20: మండల కేంద్రమైన మిరుదొడ్డి పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ దేవి అమ్మవారి రెండో వార్షికోత్సవ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు మాణిక్యాలతో పాటు బోనాల్లోని నైవేద్యాన్ని సమర్పించి తమ మొక్కులను చెల్లించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం చేస్తా



మాట్లాడుతున్న పీపీ జీవన్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 20: సిద్దిపేట కోర్టుకు మొట్టమొదటి రెగ్యులర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రభుత్వం తనకు అవకాశం కల్పించినందని న్యాయవాది జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతానని, తప్పుచేసిన వారికి శిక్ష పడేలా చూస్తానన్నారు. కక్షిదారులకు ఎలాంటి సహాయ సహకారమైనా అందిస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి పీపీగా బాధ్యతలను అప్పగించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో న్యాయవాది ప్రకాష్, ఖలీమొద్దీన్ ఉన్నారు.

## కరపత్రం ఆవిష్కరణ



పుస్తక ఆవిష్కరణ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 20: ఈనెల 26న కవి వంగరి వెంకటేశం రచించిన సప్తశతి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు బాలసాహితీవేత్త రాజేశం తెలిపారు. ఈ మేరకు ఆదివారం సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు రాజమౌళి, లక్ష్మయ్య, వీరారెడ్డి, సతీష్‌కుమార్, బాలచంద్రం, రాజయ్య, యాదగిరి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 20: కరెంట్ షాక్ తగిలి వ్యక్తి మృతిచెందిన సంఘటన మద్దూరు మండలంలోని లద్నూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మచ్చ యాదగిరి(48) గత 15ఏండ్లుగా హైదరాబాద్‌లో కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో యాదగిరి తన స్వగ్రామంలో జరిగే బొడ్రాయి పండుగ కోసం కుటుంబ సభ్యులతో వచ్చాడు. సాయంత్రం వేళ తన ఇంట్లోకి కరెంట్ రావడం లేదని పక్కనే ఉన్న కరెంట్ స్తంభం వద్దకు వెళ్లి తనిఖీ చేస్తున్న క్రమంలో యాదగిరికి కరెంట్ షాక్ తగిలింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని చికిత్స కోసం చేర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.